క్లుప్తంగా

డీఈగా ఉద్యోగోన్నతి

బూర్గంపాడు: మండల పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు భద్రాచలం డివిజన్ డీఈగా ఉద్యోగోన్నతి పొందారు. సోమవారం ప్రమోషన్ ఆర్డర్‌లు అందుకున్న ఆయనను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్‌శర్మ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించి సన్మానించారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల అధికారులతో నేడు(మంగళవారం) వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం బాధ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు మాట్లాడుతూ.. దమ్మపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు, అలాగే అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఆయా సమయాలకు బాధ్యులైన అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కోళ్ల ఫారం షెడ్డు తొలగింపు

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కోళ్ల ఫారం షెడ్డును సోమవారం మండల పరిషత్ అధికారులు తొలగించారు. గత మూడు రోజుల క్రితం స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ వెనకాల ఉన్న నర్సరీ పక్కన అక్రమంగా కోళ్ల షెడ్డు నిర్మించారు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బందితో ఆ షెడ్డుతో పాటు, చుట్టుపక్కల ఉన్న గుడిసెలను తొలగించడం జరిగిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాల్సి వస్తున్న హెచ్చరించారు.

బకాయిలు చెల్లించాలి

అశ్వాపురం: గత ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్మికుల సమస్యలపై ఎంపీడీఓ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏడెల్లి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పారెడ్డి శ్రీనివాసరెడ్డి, ధరావత్ రాంబాబు, రవి, దొడ్డా వెంకటేశ్వర్లు, సున్నం శ్రీనివాస్, వెంకటేష్, వెంకటరమణ, పద్మ, రమణమ్మ పాల్గొన్నారు.

జీవో విడుదల చేయాలి

దమ్మపేట: గురుకుల ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన జీవో విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని తక్షణమే జీవో విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు సూతకాని శ్యామ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం మొదలై రోజులు గడుస్తున్నా ఇప్పటి దాకా ప్రభుత్వం జీవో విడుదల చేయకపోవడంతో గురుకుల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఏళ్లుగా గురుకులాల్లో బదిలీ, ప్రమోషన్ల కోసం ఉద్యోగులంతా పడిగాపులు పడుతున్నారని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. అలాగే జీవో 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

అశ్వారావుపేటరూరల్: గాంధీ హాస్పిటల్‌లో నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘం నాయకుడు మోతీలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర రెడ్డి, రాకేష్ రెడ్డిను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. దీక్ష చేసే విద్యార్థి నాయకులను కనీసం పరామర్శించే స్వేచ్ఛ కుడా రాష్ట్రంలో లేకపోవడం దారుణమని అన్నారు. పరామర్శకు వెళ్లిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం సరికాదని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను పోలీస్ భద్రతతో పరామర్శించడానికి అనుమతి ఇచ్చి, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, ప్రసూతి కానుల రూ.లక్ష ఇవ్వాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం మోటార్ సైకిల్ ఇవ్వాలని అన్నారు. సంఘ మండల అధ్యక్షుడు సూరం పుల్లారావు, కార్యదర్శి ఓరుగంటి శ్రీను, పొక్కిలి డానియేల్, సంగు శ్రీను, హలావత్ శివ, వీరభద్రం, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చిందంటే దారి బంద్..

- వాగుల ఉధృతికి తెగిపోతున్న డైవర్షన్ రోడ్లు
- గిరిజన గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- బ్రిడ్జి పనుల వెనుకబాటుతో తిప్పలు


కోతకు గురైన పాములేరు వాగు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

ములకలపల్లి: అసంపూర్తి పనులతో ఆదివాసీలకు తిప్పలు తప్పడంలేదు. వాగులపై వంతెనల నిర్మాణాలు ఆరంభించి నెలలు గడుస్తున్నా పెండింగ్‌లోనే ఉండడంతో ఏజెన్సీ గ్రామాలకు వానొస్తే దారిలేకుండా పోతోంది. మండలపరిధిలోని ముత్యాలంపాడు శివారులో పాలవాగుపై., ములకలపల్లి శివారు పాములేరు వాగుపై నూతనంగా బ్రిడ్జీలను నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరుకాగా, సుమారు ఏడు నెలల క్రితం ఆరంభించారు. ఐతే నేటికీ పనులు పూర్తికాలేదు.

మే నెలాఖరులోనే..

ముత్యాలంపాడు శివారులో నిర్మిస్తున్న వంతెన నిమిత్తం ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తొలివర్షాలకే కొట్టుకుపోయింది. మే నెల 25వ తేదీన కురిసిన వానలకు కోతకు గురికాగా, మారుమూల గ్రామాల ఆదివాసీలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముత్యాంపాడు, రాచన్నగూడెం జీపీ కేంద్రాలతోపాటు రాచన్నపేట, రాచన్నగూడెం, మోటుగూడెం, పాత జిన్నెలగూడెం, కొత్తజిన్నెలగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒక రోజు అనంతరం పునరుద్దరణ చేపట్టగా, తాత్కాలికంగా ప్రయాణాలు కొనసాగాయి.

రెండో రోజూ జలదిగ్బంధనంలోనే..

తాళ్లపాయ జీపీ గ్రామాల ప్రజలు రెండో రోజూ జలదిగ్బంధనంలోనే గడిపారు. ములకలపల్లి–తాళ్లపాయ మధ్య ఉన్న పాములేరు వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు, శిథిలావస్థకు చేరిన మినీ బ్రిడ్జీని పూర్తిగా కూల్చివేశారు. డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసినా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆదివారం రోడ్డు పూర్తిగా కోతకు గురై, మోరీలు బయటపడ్డాయి. దీంతో తాళ్లపాయ, రింగిరెడ్డిపల్లి, బూర్గుకొయ్యగుంపు, మంగళిగుట్ట సుందర్‌నగర్ గ్రామాలకు రహదారి సౌకర్యమే లేకుండా పోయింది, దీంతో రెండు రోజులుగా ఆయాగ్రామాల ప్రజలు జగదిగ్బంధనంలోనే గడిపారు. జీపీ కార్యదర్శి సంజీవ్, ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు రహదారి సౌకర్యంలేక వాగు ఒడ్డునే ఉండిపోయారు.

స్థానికుల నిరసన..

పాములేరు వాగు కోతకు గురై రెండు రోజులుగా రహదారి సౌకర్యం లేకపోవడంతో రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయ, బూర్గుకోయగుంపు, మంగళిగుట్ట, సుందర్‌నగర్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సోమవారం వాగు నీళ్లలో నిలబడి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం వల్లే తాము ఇబ్బందులకు గురౌతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపించే వరకూ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..



అనివార్య కారణాల వల్ల వంతెనల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. ముత్యాలంపాడు పాలవాగు వద్ద జేసీబీలు అందుబాటులో ఉంచుతున్నాం. డైవర్షన్ కోతకుగురైనా, ప్రవాహనం తగ్గగానే యుద్ధ ప్రాతిపదికన మరలా వేస్తున్నాం. ములకలపల్లి పాములేరు వాగు వద్ద మోరీలు ఏర్పాటు చేస్తున్నాం. అంతేకాకుండా రూ.13 లక్షలతో ఇనుప వంతెన నిర్మించేందుకు మెటీరియల్ కూడా వచ్చింది. వర్షాలు తగ్గగానే ఐరన్ బ్రిడ్జి వేస్తాం. అసౌకర్యం కలుగకుండా చూస్తాం.

– సుబ్బరాజు, ఏఈఈ, ఐటీడీఏ

ఉత్తీర్ణత శాతం మెరుగుపడాలి


పినపాక: విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపడాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కస్తూర్బా, గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బెడ్లు, దుప్పట్లు, పుస్తకాలు, వాటర్ బాటిల్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం, మెనూ ప్రకారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంట షెడ్ సరిగా లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మత్తులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వృద్ధికి తోడ్పడండి..

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం విధులు నిర్వహించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన 11 మంది పంచాయతీ కార్యదర్శులకు మణుగూరులోని ప్రజాభవన్ కార్యాలయంలో ఎమ్మెల్యే పర్మినెంట్ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తూ వారధిగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు మణుగూరు శ్రీనివాసరావు, పినపాక రామకృష్ణ, బూర్గంపహాడ్ జమలారెడ్డి, కరకగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమార్, ఆళ్లపల్లి శ్రీనివాస్, ఎంపీవోలు పల్నాటి వెంకటేశ్వరరావు, సునీల్‌కుమార్, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్, గణేశ్‌రెడ్డి, మధు తదితరులు ఉన్నారు.

రైతు భరోసా అందించాలి

బూర్గంపాడు: పంటలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసానందించాలని ప్రత్యేక మహాజన సభలో ఎక్కువమంది రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బూర్గంపాడు రైతు వేదికలో రైతు భరోసాపై రైతుల అభిప్రాయాల కోసం ప్రత్యేక మహాజన సభను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు రైతులు పంటలు సాగు రైతులకు భూమి విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రైతు భరోసా అందించాలని కోరారు. పంటలు సాగు చేయని గుట్టలు, వాగులు, వంకలకు రైతు భరోసా అవసరం లేదన్నారు. అదేవిధంగా వ్యవసాయ భూములను వ్యాపారాల కోసం వినియోగిస్తున్న భూములకు కూడా రైతు భరోసా అవసరం లేదని రైతులు అభిప్రాయపడ్డారు. ఐదెకరాలు, పది ఎకరాల పరిమితి విధించకుండా పంటలు వేసే భూములకు మొత్తానికి రైతు భరోసా అందించాలని రైతులు కోరారు. కొందరు రైతులు వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహకాలను అందిస్తే పంట పండించిన రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. రైతు భరోసాతో కౌలు రైతులకు నష్టం జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. పంటలు సాగు చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలు లేనటువంటి రైతులకు రైతుభరోసా వంటి పెట్టుబడి సాయం అందటం లేదని కొందరు రైతులు వాపోయారు.రైతుల అభిప్రాయాలను, సూచనలను, సలహాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ అన్నారు. ఈ మహాజన సభలో ఏడీఏ తాతారావు, ఏఓ శంకర్, సొసైటీ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, మానిటరింగ్ అధికారి సుజాత, పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్, ఏఈఓలు ప్రసాద్, వైష్ణవి, సొసైటీ డైరెక్టర్లు బొల్లు రవి, కుందురు పెద్దిరెడ్డి, కోడి లింగయ్య, బత్తుల రామకొండారెడ్డి, తోకల అనిత, మేడగం రామిరెడ్డి, ఉండేటి గోవర్ధన్, బోడా గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

'పోడు'కు హక్కు పత్రాలు ఇవ్వాలి


భద్రాచలంలో ప్రదర్శన చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ శ్రేణులు

భద్రాచలంటౌన్: జిల్లాలో పోడు భూముల్లో సాగు చేస్తున్న అర్హులైన పోడుదారులందరికీ అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం పోడు సాగుదారులు బ్రిడ్జి సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీర్యాలీ నిర్వహించి ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. పోడు భూములకు సాగునీరు సౌకర్యం కల్పించి గిరిజనేతర పేదలకు, గుత్తి కోయ ఆదివాసులకు కూడా పట్టాలిచ్చి వారిపై అటవీశాఖ అధికారులు పెట్టిన అక్రమంగా కేసులు ఉపసంహరించుకోవాలన్నారు. గొత్తికోయ ఆదివాసుల గ్రామాలకు రహదారులు, మంచినీరు, విద్యుత్, విద్య వైద్యంతో పాటు ఉపాధి కల్పించి వారి గ్రామాలను రెవెన్యూ గ్రామాలతో పాటు ఎస్టీలుగా గుర్తించాలని కోరారు. ఒక్క ఆదివాసులకు మాత్రమే పట్టాలిస్తామని ప్రకటిస్తే మూడు లక్షల ఎకరాలకు దరఖాస్తు చేసుకోగా.. 50వేల మందికి మాత్రమే పట్టాలిచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ఫలితంగా అటవీ అధికారులు సాగుదారులకు పట్టాలు లేవనే పేరుతో సాగుదారులను దుక్కులు దున్నొద్దని, విద్యుత్ బోర్లు వేస్తే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ములకలపల్లి మండలంలోని రాసన్నగుట్ట గ్రామంలో అటవీశాఖ అధికారులు జేసీబీలతో ఆదివాసీ గిరిజనులపై దాడి చేసి సాగు భూమిని లాక్కున్నారని, ఇది దుర్మార్గమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, కెచ్చల కల్పన, నాయకులు ప్రభాకర్, నూప భాస్కర్, కంగాల కల్లయ్య, పోతుగంట లక్ష్మణ్, తోడెం దుర్గమ్మ, మాచర్ల సత్యం, మధుసూదన్ రెడ్డి, సాయన్న, చరణ్, మునిగిల శివ ప్రశాంత్, పాలం చుక్కయ్య, సుజాత, శాంతక్క, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం సబ్ స్టేషన్‌లో 33కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అశ్వారావుపేట ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ.. వినాయకపురం సబ్ స్టేషన్ పరిధిలోని నారాయణపురం, గంగారం గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఐఎన్‌టీయూసీ నాయకుడికి మాతృవియోగం

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారంనకు చెందిన సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు తల్లి సూర్యనారాయణమ్మ(83) సోమవారం తుదిశ్వాస విడిచారు. కాగా ఆమెకి ముగ్గురు కుమారులు కాగా కృష్ణంరాజు చివరివారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం వారి నివాసానికి వెళ్లి సూర్యనారాయణమ్మ పార్థీవదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు త్యాగరాజన్, మణుగూరు బ్రాంచ్ నాయకుడు గట్టయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు గణేశ్‌రెడ్డి, జీవరత్నం, గాండ్ల సురేశ్, కూరపాటి సౌజన్య, దొడ్డపనేని మధు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సమాజ మార్పునకు మీడియా కీలకం


ప్రెస్‌క్లబ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పీఓ రాహుల్, మీడియా సభ్యులు

భద్రాచలంటౌన్: సమాజంలో జరిగే మంచి చెడులను వెలికితీసి ప్రచారం చేయడం ద్వారా సమాజ మార్పుకు మీడియా కీలకంగా వ్యవహరిస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో భద్రాచలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య మీడియా వారిధిగా పనిచేస్తుందని, సమాజ అభివృద్ధిలో మీడియాదే కీలకపాత్ర అన్ని పేర్కొన్నారు. భద్రాచలం అంటే ఏజెన్సీ ప్రాంతమని ఈ ప్రాంతంలోని అమాయక ఆదివాసీ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలిసే విధంగా కథనాలు రాయాలని ఆయన ఈ సందర్భంగా మీడియా మిత్రులను కోరారు. భద్రాచలంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ఒక తాటి మీదికి వచ్చి ఒక కమిటీగా ఏర్పడటం అభినందనీయమని, ఐక్యంగా ప్రజా సమస్యలపై కథనాలు రాస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని చెప్పారు. భద్రాచలం మీడియా బృందానికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి శ్రీపాద శ్రీధర్, కోశాధికారి జి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, పూదోట విజయ్‌కుమార్, శ్రీనివాస్, సంతోష్ కుమార్, లక్ష్మణ్, శివ, ప్రేమ్ కుమార్, జయరాం, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి ఆమోదం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండ నుంచి జూలూరుపాడు వెళ్లే మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి గ్రామస్తులు ఆమోదం తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు, గృహ యజమానులు, గ్రామస్తులు సోమవారం సమావేశమయ్యారు. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా 50 అడుగులు వెడల్పు చేసేందుకు ఇటీవల మార్కింగ్ పెట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ తుదకు ఇరువైపులా 22 అడుగులు వెడల్పు చేసేందుకు ఏకాభిప్రాయం కుదిరింది. ఈ మేరకు లిఖితపూర్వకంగా ఎమ్మెల్యే ఆదినారాయణకు లేఖను ఇచ్చారు. ప్రధాన సెంటర్ నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. గ్రామస్తుల నుంచి ఆమోదం లభించడంతో ఇక పనులు చేపట్టడమే తరువాయి.

తక్కువ పారితోషికం సరికాదు

దుమ్ముగూడెం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు తక్కువ డబ్బులు ఇచ్చి రిటైర్మెంట్ అనంతరం ఇంటికి పంపించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం దుమ్ముగూడెం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడారు. సుమారు 40 యేళ్ల నుంచి పని చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ఆసరా పింఛన్ ఇస్తామని, టీచర్‌కు రూ.1 లక్ష, ఆయాలకు 50 వేలు ఇస్తామని చెబుతుండడం ఏ మాత్రం సరికాదని అన్నారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం తోణమే విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల షణ్ముఖ పుట్టుకతోనే తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా.. వైద్య ఖర్చుల నిమిత్తం జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ వారు సోమవారం రూ.10వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సహాయాన్ని పున్నం పవన్, ప్రణీత్‌లు వారి తండ్రి పూర్ణ జ్ఞాపకార్థంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనం కోసం మనం సంస్థ వ్యవస్థాపకులు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు కొండా మురళీ, పిండిగ రఘువరన్, సుగ్గాలా ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మణుగూరురూరల్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో కూనవరం ఎంపీయూపీఎస్‌లో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్, నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావులను లయన్స్ క్లబ్ సభ్యులు పుష్ప గుచ్ఛం శాలువాలతో ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాష్, కార్యదర్శి మీరాహుస్సేన్, కోశాధికారి శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్ పూర్ణచందర్‌రావు, నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన చట్టాల రద్దుకు డిమాండ్

భద్రాచలంఅర్బన్: జులై 1 నుంచి అమలులోకి వచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య డిమాండ్ చేశారు. నూతన చట్టాల అమలును వ్యతిరేకిస్తూ సోమవారం భద్రాచలం ప్రథమ శ్రేణి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత చట్టాలను మార్చి మూడు చట్టాలను అమలు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐలు, ఐఏఎల్, బీఆర్ఎస్, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు, పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు.

కొమరయ్య వర్ధంతి సభకు తరలిరండి

చర్ల: జూలై 4న ఖమ్మంలో జరిగే దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభకు వేలాదిగా రావాలని ఎన్డీ డివిజన్ నాయకుడు ముసలి సతీష్ పిలుపునిచ్చారు. సోమవారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జూలై 4న జరిగే దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభకు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు వేలాదిగా తరలి వచ్చి నివాళులర్పించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు ఇర్పా సమ్మక్క, సబ్కా నగేష్, రవి, రాజు, రుత్విక, నాగలక్ష్మి, శ్రీదేవి, రమణ, బాయమ్మ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో జూలై 4న ఖమ్మం పట్టణంలో జరిగే దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ, ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఉమర్, సన్నం భులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని వైద్యులు కేక్ కట్ చేసి వైద్యసిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారులను బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సభ్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, 108, 102 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ సభ్యులు


మణుగూరుటౌన్: డాక్టర్స్ డే వేడుకల్లో సింగరేణి వైద్యులు, అధికారులు


భద్రాచలంటౌన్: జమాల్ ఖాన్, సహచర వైద్యులను సన్మానిస్తున్న జర్నలిస్టు సంఘం సభ్యులు


మణుగూరురూరల్: వైద్యులను సన్మానిస్తున్న సిబ్బంది


చండ్రుగొండ: డాక్టర్లను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది


బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ డాక్టర్‌ను సన్మానిస్తున్న చేయూత ట్రస్ట్ ప్రతినిధులు


గుండాల: వైద్యాధికారికి సన్మానం..


కరకగూడెం: వైద్యాధికారిని సత్కరిస్తున్న వైద్య సిబ్బంది